క్లుప్తంగా...

ఏబీవీపీ శంషాబాద్ కన్వీనర్‌గా మహేష్



శంషాబాద్: ఏబీవీపీ శంషాబాద్ కన్వీనర్‌గా చాకలి మహేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ జానారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తానని మహేష్ అన్నారు. తనకు పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడితో పాటు విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇండోర్‌కు గల్ఫ్ జేఏసీ బృందం

శంషాబాద్: తెలంగాణ గల్ఫ్ జేఏసీ బృందం ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మధ్యప్రదేశ్ ఇండోర్‌కు బయలుదేరి వెళ్లారు. మూడురోజుల పాటు ఇండోర్‌లో జరిగే 17వ ప్రవాసి దివస్‌లో గల్ఫ్ దేశాల్లో ప్రవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సుమారు 3,500 మంది ప్రవాసీలు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. జేఏసీ బృందంలో ప్రదేశ్ కాంగ్రెస్ ప్రవాస భారతీయుల గల్ఫ్ డివిజన్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి,సీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని శ్రీనివాస్‌రావు, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్ల, గల్ఫ్ జేఏసీ చైర్మన్ రవిగౌడ్, భీంరెడ్డి తదితరులున్నారు.

జహంగీర్ దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు



ఎమ్మెల్యేను సన్మానించిన మైనార్టీలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదివారం జహంగీర్ దర్గాలో నాజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం కుటుంబ సభ్యులతో దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఛద్దర్ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

మైలార్‌దేవ్‌పల్లి: క్రీడలతో శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం లభిస్తాయని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాంచందర్‌రావు అన్నారు. గత ఐదు రోజులుగా మహావీర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, అగ్నిహోత్రి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నర్సింహారెడ్డి

గన్‌ఫౌండ్రీ: కవిత్వానికి నూతన అభివృద్ధిని జోడించినప్పుడే చరిత్రలో నిలిచిపోతుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సంస్కృతిక సౌజన్యంతో దర్పణం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రచయిత్రి సత్యవేణి ప్రదర్శించిన సత్యవాక్కులు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కవిత్వం అనేక రూపాల్లో అనేక విధాలుగా రాస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షులు సూర్యప్రకాష్ రావు, ప్రముఖ కవి డాక్టర్ దీపక్, వేదిక ప్రధాన కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 7వ తేదీ ఓ వ్యక్తి కాటేదాన్ నుంచి దుర్గానగర్ వైపు వెళ్తుండగా ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అతను పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో బాధితుడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని డాక్టర్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాల కోసం వాకబు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

అమ్మపల్లి ఆలయానికి పెరిగిన ఆదరణ.. ఆదాయం

- ఏడాదికి కోటి రూపాయలుపైనే..
- జోరుగా రాజగోపురం మరమ్మతు పనులు
- ఆలయం వద్ద ప్రీ వెడ్డింగ్ షూట్‌ల సందడి



ఆలయం ఆవరణలోని కోనేరు

శంషాబాద్ రూరల్: చారిత్రాత్మక అమ్మపల్లి దేవాలయం రాజగోపురం మరమ్మతులు పనులు జోరుగా సాగుతున్నాయి.. ఆలయానికి రోజురోజుకు భక్తుల రాక పెరిగిపోతుండడంతో పాటు ఆదాయం భారీగా సమకూరుతోంది. దీనికితోడు దాతల సహకారం కూడా తోడవడంతో సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ఇక్కడ శ్రీరామనవమి వేడుకలతో పాటు ప్రతి నెలా పునర్వసు నక్షత్రంను పురస్కరించుకుని మాస కల్యాణం నిర్వహిస్తున్నారు.

◆ మండలంలోని నర్కూడ శివారులో ఉన్న అమ్మపల్లి (శ్రీ సీతారామచంద్రస్వామి) ఆలయానికి ఘన చరిత్ర ఉంది. ఆలయ రాజగోపురం, కోనేరు ఇక్కడి ప్రత్యేకతలు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయం హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్నా కొన్నేళ్ల కిందటి వరకు పెద్దగా ఆదరణకు నోచుకోలేదు. గతంలో సినిమా షూటింగ్‌లు, శ్రీరామనవమి సందర్భంలో మాత్రమే ఇక్కడ సందడి ఉండేది. కాగా దేవాలయ రాజగోపురంతో పాటు ప్రాకారాలు చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. దేవాదాయశాఖ మంత్రులు ఇక్కడకు వచ్చినప్పుడు ఆలయం పరిస్థితిని స్థానికులు వారికి తెలిపినా నిధులు మంజూరు కాలేదు.

దాతలు ముందుకు రావడంతో..

ప్రధానంగా ఆలయం రాజగోపురం మరమ్మతు పనులకు దాతలు ముందుకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, జడ్పీటీసీ తన్వీరాజు సహకారంతో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.కోటి నిధులు వెచ్చించి ఈ పనులు చేపడుతున్నారు. గత ఏడాది మార్చిలో పనులు



అమ్మపల్లి ప్రధాన ఆలయం

ప్రారంభించారు. శ్రీ సువర్ణరామ్ ఆర్కిటెక్చర్ సంస్థ ఈ పనులను చేపట్టింది.

షెడ్డుల ఏర్పాటు..

ఆలయం ఆవరణలో పెళ్లిళ్లు జరుపుకోవడానికి వీలుగా దాతల సహాయంతో షెడ్డు ఏర్పాటు చేశా రు.



రాజగోపురానికి మరమ్మతులు చేపట్టిన దృశ్యం

మరో దాత సహాయంతో ఇటీవల కొత్తగా షెడ్డును నిర్మిస్తున్నారు. ఇక్కడ పెళ్లిళ్లు, అయ్యప్పస్వాముల దీక్షతో పాటు శ్రీరామనవమి సందర్భంలో అన్నదానం చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పెరిగిన ఆదాయం..

సినిమా షూటింగులు నిలిచిపోయినప్పటికీ ఆలయం వద్ద ప్రీ వెడ్డింగ్ షూట్‌ల సందడి నెలకొంది. దీంతో ఆలయానికి ఆదాయం పెరిగింది. గతంలో ఏడాదికి రూ.2 లక్షల వరకు ఉన్న ఆదాయం ఇప్పుడు కేవలం ఒక నెల వ్యవధిలోనే సమకూరుతుంది. భక్తుల తాకిడి కూడా పెరిగింది. ఇదిలా ఉండగా.. ఆలయంలో ఆర్జిత సేవలు, షూటింగ్‌లు, హుండీ ద్వారా ఏడాదికి రూ.కోటికి పైగా ఆదాయం వస్తుంది.

సౌకర్యాలకు పెద్దపీట..

ఆలయం వద్ద భక్తులకు సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. దాతల సహాయంతో ప్రస్తుతం రాజగోపురం మరమ్మతు పనులు, షెడ్డ నిర్మాణం జరుగుతోంది. రానున్న రోజుల్లో ఆలయ ప్రాకారాల మరమ్మతుల కోసం ప్రయత్నిస్తున్నాం.

రామశర్మ, ఇంచార్జి ఈఓ, అమ్మపల్లి

సాటి మనుషులను ప్రేమించాలి



కార్యక్రమంలో పాల్గొన్న మఠం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ కాటేదాన్‌లోని అమ్మగార్డెన్‌లో నిర్వహిస్తున్న శ్రీ రామకృష్ణ మఠం రాష్ట్రస్థాయి భక్త సమ్మేళన కార్యక్రమం రెండవ రోజు ఆదివారం ముగిసింది. వివిధ ప్రాంతాలలోని శ్రీ రామకృష్ణ మిషన్ అనుబంధ సంస్థల నుంచి స్వామీజీలు, మాతాజీలు, చివరి రోజు తమ సందేశాలను భక్తులకు అందజేశారు. సాటి మనుషులను ప్రేమించడం అలవర్చుకోవాలని స్వామి హ్యాదానందజీ మహారాజ్ అన్నారు. శ్రీరామకృష్ణుడి జీవిత విశేషాలను ప్రదర్శించారు. విశ్రాంత ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు సత్యప్రసాద్‌రాయ్ అవతార పురుషుడు శ్రీరామకృష్ణుడు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలు, నాటికలు విశేషంగా ఆకట్టుకు



విద్యార్థుల ప్రదర్శన

న్నాయి. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు బొల్ల శ్రీనివాస్, మన్న వెంకటేష్, గంజి వెంకటేష్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ఆదరిద్దాం

గన్‌ఫౌండ్రీ: సంక్రాంతి పండగను సంతోషానికి ప్రతీకా అని జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ శాంతాకుమారి అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని శ్రీ అవంతి సిల్క్స్ వస్త్ర షోరూమ్‌లో సంక్రాంతి వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. నిర్వాహకురాలు నివేదిత మిశ్రా మాట్లాడుతూ.. తమ వద్ద చేతులతో వేసిన ప్రత్యేకమైన చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పోచంపల్లి, గద్వాల్ వంటి పలు రకాల చీరలు అందిస్తున్నట్లు వెల్లడించారు. సంక్రాంతిని పురస్కరించుకుని చేనేత ఉత్పత్తులపై 50 శాతం తగ్గింపు ధరలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ సభ్యులు

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్ కాలనీ, సీబీఆర్ ఎస్టేట్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కాలనీ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. సీబీఆర్ ఎస్టేట్ నూతన అసోసియేషన్ సభ్యులు వెంకట్, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, ప్రసాద్ , జనరల్ సెక్రటరీ వెంకటరాము, విశ్వాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా మెడికల్ క్యాంపు

మాదాపూర్: మాదాపూర్‌లోని చంద్రనాయక్ తండాలో మెడికవర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగర్వాల్ సమాజ్ దుర్గం చెరువు శాఖ, అగర్వాల్ సేవాదళ్, బద్రి విశాల్ పన్నలాల్ పిట్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో ఉచిత సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు అభినందించారు. కార్యక్రమంలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



రాజేంద్రనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి కోరారు. అత్తాపూర్‌లోని న్యూ హోప్ హియరింగ్ క్లినిక్, డెక్కన్ విజన్ ఐ కేర్ 2వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్య పరీక్షలు చేయడం అభినందనీయమన్నారు. హియరింగ్ టెస్ట్, హియరింగ్ ఎయిడ్ ట్రయిల్, పిట్టింగ్, స్పీచ్ థెరపీ, కంటి పరీక్షలు, బీపీ, ఈసీజీ, జనరల్ ఫిజీషియన్ పరీక్షలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, డాక్టర్ సందీప్, డాక్టర్ వికాస్, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.


నైపుణ్యం పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థోపెడిక్ వైద్యులు

సుల్తాన్‌బజార్: వైద్య విద్యార్థులకు ఆర్థోపెడిక్ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని హోమ్ చైర్మన్ డాక్టర్ రమేష్ అన్నారు. ఉస్మాయా జనరల్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలోని న్యూ అకడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించిన హోమ్-2023 హైదరాబాద్ ఆర్థోపెడిక్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా 21వ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్థోపెడిక్ విభాగంలో అత్యాధునిక వైద్య పరిజ్ఞానం వైద్య విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. వృత్తి, నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఇటువంటి సదస్సు ఉపయోగపడుతుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఆర్థోపెడిక్ వైద్య విద్యార్థులు 350 మంది వైద్య విద్య విద్యార్థులకు ఈ సదస్సులో మూడు రోజులపాటు క్లినికల్ ఎగ్జామినేషన్, ఇన్వెస్టికేషన్, మేనేజ్‌మెంట్ రిహాబిలిటేషన్ వాటిపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హోమ్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ తిమ్మారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ సుధీర్, డాక్టర్ శివరాం నాయక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘాల ప్రతినిధులు

జియాగూడ: యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిలభారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజబోయిన లక్ష్మణ్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్‌యాదవ్, గ్రేటర్ అధ్యక్షుడు మైల్కోల్ మహేందర్‌యాదవ్, కార్పొరేటర్ స్వామియాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలో అఖిలభారత యాదవ్ మహాసభ గ్రేటర్ హైదరాబాద్‌కార్వాన్ నియోజకవర్గం సమావేశం, నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ, కమిటీల నియామక పత్రాల అందజేత, సన్మాన కార్యక్రమాలు కార్వాన్ నియోజకవర్గం కన్వీనర్ గజ్జి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈసారి జరిగే సదర్ ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. అలాగే గ్రేటర్‌లో బర్లదొడ్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు, యాదగిరిగుట్టలో 2 ఎకరాల్లో భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ చదివే యాదవ విద్యార్థుల కోసం ఢిల్లీ యాదవ భవన్‌లో ఉచిత వసతి కల్పిస్తున్నామన్నారు. శ్రీశైలంలో 150 గదులతో వసతి గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్‌యాదవ్, లక్ష్మణ్ యాదవ్ అన్ను యాదవ్, ఆరేళ్ల శ్రీశైలం యాదవ్, శివకుమార్‌యాదవ్, ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం



శంషాబాద్: శంషాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా మెరుగు సురేష్ నియమితులయ్యారు. ఆదివారం పట్టణంలోని ముదిరాజ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముదిరాజ్‌ల డిమాండ్ల సాధనకు పనిచేస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తన్వీ ముదిరాజ్, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్ ముదిరాజ్, కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, ఎంపీటీసీ సంగీత, సిద్ధంతి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బొబ్బిలి కిష్టయ్య,సర్పంచులు రాజ్‌కుమార్, చంద్రశేఖర్, యాదయ్య,తోటరాములు, నీరటి రాజు, బొబ్బిలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కేలండర్ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సరోత్తంరెడ్డి తదితరులు

శంషాబాద్: ఉపాధ్యాయుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారంలో పీఆర్‌టీయూ నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ సరోత్తంరెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ 2023 కేలండర్‌ను ఆదివారం ఎమ్మెల్సీ సరోత్తంరెడ్డి శంషాబాద్ పట్టణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్, హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్‌నగర్ పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, శంషాబాద్ మండల కమిటీ సభ్యులు మల్లేష్, బాల్‌రాజ్,విజయ్, కిషన్‌నాయక్, నందివర్ధన్,విద్యాకర్, యాదయ్య,ప్రవీణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కేంద్రం ప్రారంభం



ఆరోగ్య బీమా నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కేంద్రాన్ని ఆదివారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం పథకాలను వివరించి అర్హులకు లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు జనార్ధన్, సుధాకర్‌రెడ్డి, శరణమ్మ, చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, మజార్, సచిన్, శివ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాజేంద్రనగర్: శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989-90 సంవత్సరపు 10వ తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. హిమాయత్‌సాగర్ సౌడమ్మ గుట్టపై నిర్వహించిన ఈ సమ్మేళనంలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శివరాంపల్లి, రాజేంద్రనగర్, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, ప్రాంతాల నాటి విద్యార్థులు సమావేశమయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వచ్చే సంవత్సరం మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించారు.

నయనానందకరం.. కూచిపూడి నృత్యం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్త కళా ప్రదర్శనలో భాగంగా సత్యం డ్యాన్స్ అకాడమీ గురువు మెళ్ళచెరువు కామేశ్వరీ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో గణపతి గీతం, జయము జయము, భావయామి, నమరామాయణం, లలిత స్తుతి, జయ జయ, జతిస్వరం, కోలాటం, శ్రీరామచంద్ర కృపాలు, దశావతారాలు తదితర అంశాలను కళ్యాణి, శ్రావణి, విబా, ఇషిత, శ్రీయ, కీర్తన, సాయిసహస్ర, సౌమ్య ప్రదర్శించారు.

సండే.. సందడి..

- వీకెండ్‌తో కిటకిటలాడిన పాతబస్తీ పర్యాటక ప్రాంతాలు
- నరదాగా గడిపిన సందర్శకులు..
- వాహనాల రద్దీ పెరగడంతో తప్పని ట్రాఫిక్ తిప్పలు



కిటకిటలాడుతున్న గుల్జార్‌హౌస్-చార్మినార్ పరిసరాలు

చార్మినార్: ఆదివారం పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. చార్మినార్ కట్టడంతో పాటు హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం , సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, మక్కా మసీదు, లాడ్‌బజార్ తదితర పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల సందడి కనిపించింది. వాహనాల రాకపోకలు పెరగడంతో గుల్జార్‌హౌస్, చార్‌కమాన్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

కొత్తగా ఏర్పాటు చేసిన బారికేడ్లతో రాకపోకలు సులువుగా..

వీకెండ్ రోజులతో పాటు సాధారణ రోజుల్లో కూడా చార్మినార్ సందర్శనకు పర్యాటకులు అత్యధిక సంఖ్యలో వస్తుంటారు. నగరం నుంచి వచ్చే వాహనాలను కేవలం గుల్జార్‌హౌస్ ఫౌంటేన్ వరకు మాత్రమే అనుమతించి.. అక్కడి నుంచి కాలినడకన చార్మినార్, మక్కా మసీదు చేరాల్సి ఉంటుంది. దీంతో పర్యాటకులకు అసౌకర్యం కలగకుండా గుల్జార్‌హౌస్ రోడ్డు వద్ద పర్యాటకుల సౌకర్యార్థం చార్మినార్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కాలినడకన రాకపోకలు సులభతరమయ్యాయి.

ఆటోల పార్కింగ్‌తో ట్రాఫిక్ జాం..

గుల్జార్‌హౌస్ ఫౌంటేన్ వద్ద నుంచి వాహనాలు వెనుకకు వెళ్లాల్సి ఉండడంతో ఇక్కడ ప్రతి నిముషం ఎంతో విలువైంది. చుట్టూ తిరిగి వెళ్లే వాహనదారులకు రోడ్డుపై ట్రాఫిక్ జాం లేకుండా ఉండాలి. అయితే ఆటోరిక్షాలు ఈ రోడ్లకు ఇరువైపులా అక్రమ పార్కింగ్‌లు చేస్తూ ట్రాఫిక్ జాంలకు పాల్పడుతున్నారు. ప్రయాణికులను ఎక్కించుకునే వరకు రోడ్డుపైనే నిలిపి వేస్తుండడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై ఆటోరిక్షా డ్రైవర్లతో మాట్లాడితే.. గిరాకీ లేకపోతే.. మేము బతికేదెలా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. తమకు పార్కింగ్ స్థలం కావాలని కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230